05ATP23_05ATP23.qxd 23-10-2025 PM 10:53 Page 1



## సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే



చెక్కులను అందచేస్తున్న ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి

**తాడిపత్రిటౌన్, అక్టోబర్ 23 ప్రభాతవార్త**

తాడిపత్రి నియోజకవర్గం వ్యాప్తంగా పలువురికి మంజూరైన సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను తాడిపత్రి పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి గురువారం పంపిణీ చేశారు. ఇందులో భాగంగా 92 మందికి మంజూరైన 54,61,355 రూపాయల సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే వారికి అందచేశారు.

## బుగ్గరామలింగేశ్వరున్ని దర్శించుకుని జె.సి ప్రభాకర్‌రెడ్డి

**తాడిపత్రిటౌన్, అక్టోబర్ 23 ప్రభాతవార్త**



శివున్ని దర్శించుకుంటున్న జె.సి.

పట్టణ సమీపంలోని పెన్నానది తీరాన వెలసిన బుగ్గరామ లింగేశ్వరున్ని గురువారం మున్సిపల్ చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి దర్శించుకున్నారు. కార్తీకమాసం పురస్కరించుకుని ఆయన ఆలయానికి చేరుకుని సాధారణ భక్తుల క్యూ లైన్‌లో సాధారణ భక్తుని లాగా వెళ్లి స్వామిని దర్శించుకున్నారు. భక్తులతో మమేకమై ఉత్సవాల ఏర్పాట్లపై ఆరా తీశారు. మొదటి కార్తీక సోమవారం ఏర్పాట్లపై ఆలయ కమిటీ వారితో సమీక్షించారు. ఈ సందర్భంగా అర్చకులు జె.సి ప్రభాకర్‌రెడ్డికి స్వామివారి ప్రసాదాలను అందచేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చంద్రమోహన్, కమిటీ సభ్యులు రంగనాథరెడ్డి పాల్గొన్నారు.

## పెంచిన రాయల్టీని వెంటనే తగ్గించాలి

**తాడిపత్రిటౌన్, అక్టోబర్ 23 ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం పెంచిన రాయల్టీని తగ్గించి తాడిపత్రి చుట్టుపక్కల ఉన్నటువంటి నల్లబండల పరిశ్రమలను ఆదుకోవాలని సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు ఉమాగౌడ్, నరసింహారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కష్టాల్లో మునిగితేలుతున్న నాపరాతి పరిశ్రమను కూటమి ప్రభుత్వం మరింత కష్టాల్లోకి నెట్టేసిందని, నియోజకవర్గంలో వ్యవసాయం తరువాత నాపరాతి పరిశ్రమ పెద్దదని, నాపరాతి గనులు, పాలీష్ ఫ్యాక్టరీలు, లోడింగ్, అన్‌లోడింగ్ కార్మికులు, ట్రాక్టర్, లారీ డ్రైవర్లు ఇలా వేలాది మంది కార్మికులు ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. ఇటీవల ప్రభుత్వం నాపరాళ్లు, ఇతర ఖనిజాల ఎగుమతి చేసేందుకు వసూలు చేసే సీనరేజ్(రాయల్టీ)ని ప్రవేట్ సంస్థకు అప్పగించిందన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి కార్మికులు కుటుంబాలు ఈ పరిశ్రమ పైనే ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారని ఉన్నట్లుండి ప్రభుత్వం ప్రైవేట్ పరం చేయడంతో కార్మికులకు ఉపాధి లేక అష్టకష్టాలు ఎదుర్కొంటున్నారన్నారు, కావున స్థానిక ప్రజా ప్రతినిదులు జోక్యం చేసుకొని ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు.

### లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో

## ఉచిత కంటి వైద్యశిబిరం




కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

**యాడికి, అక్టోబర్ 23 ప్రభాతవార్త**

మండలంలోని రాయలచెరువు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక లయన్స్‌క్లబ్ కార్యాలయంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి వైద్యసిబ్బంది హాజరైన వారికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరానికి దాదాపు 60 మంది హాజరు కాగా వారిలో 30 మందిని శస్త్రచికిత్సల కోసం ఎంపిక చేశారు. వారికి బెంగళూరులో ఉచిత ఆపరేషన్లు నిర్వహించి తిరిగి వారిని గమ్యస్థానాలకు చేర్చడం జరుగుతుందని క్లబ్ అధ్యక్షులు తెలిపారు. అలాగే గత నెలలో ఆపరేషన్లు చేయించుకున్న వారికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. వైద్యశిబిరానికి వచ్చిన వారికి ట్రెజరర్ అల్లాబకాష్ భోజనవసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ రామనాథ్, రవిప్రసాద్, సత్యనారాయణ, ఇస్మాయిల్, రవికుమార్‌రెడ్డి, శేషానందరెడ్డి, సూర్యనారాయణ, దివాకర్‌రెడ్డి, ఎల్ఐసి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## వార్డులో పర్యటించిన కౌన్సిలర్ రంగనాథరెడ్డి



వార్డులో పరిశీలిస్తున్న కౌన్సిలర్ రంగనాథరెడ్డి

**తాడిపత్రిటౌన్, అక్టోబర్ 23 ప్రభాతవార్త**

పట్టణంలోని 13వవార్డు సుంకులమ్మపాలెంలో గురువారం వార్డు కౌన్సిలర్ రంగనాథరెడ్డి పర్యటించారు. ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆయన వార్డులో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డులో డ్రైనేజీ, మంచినీటి కొళాయిలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బింగి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు యాడికి విద్యార్థులు

**యాడికి, అక్టోబర్ 23 ప్రభాతవార్త**



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు సీతారామాంజనేయులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 8వ తరగతి విద్యార్థి మణికంఠ అండర్-14 బీచ్ వాలీబాల్, 10వ తరగతి విద్యార్థి ఉదయకిరణ్ అండర్-17 వాలీబాల్‌లో రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనడానికి అర్హత సాధించారని ఆయన పేర్కొన్నారు. ఒకవైపు ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తూ మరోవైపు క్రీడల్లో విశేష ప్రతిభ కనబరుస్తూ ఈ స్థాయికి ఎదిగిన విద్యార్థులకు మండలంలోని క్రీడాకారులు అభినందనలు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను వ్యాయమ ఉపాధ్యాయులు చంద్రకళ, శివశంకర్, ఉపాధ్యాయులు రవికుమార్, ఇంతియాజ్‌లు ప్రత్యేకంగా అభినందించారు.

## అర్హత కలిగిన భవన నిర్మాణ కార్మికులందరికీ పట్టాలిస్తాం

- భోగస్ పట్టాలు ఉంటే చర్యలు తప్పవ్
- కార్మికుల స్థలాలను పరిశీలించిన ఎమ్మెల్యే




భవ నిర్మాణ కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

**కదిరి, అక్టోబర్ 23 ప్రభాతవార్త**

అర్హత కలిగిన భవన నిర్మాణ కార్మికులందరికీ ప్రభుత్వం పట్టాలు మంజూరుచేస్తుందని, ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం ఆర్డిఓ కార్యాలయం ఎదుట భవన నిర్మాణ కార్మికుల స్థలాలను ఆర్డిఓ వివిఎస్ శర్మతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భోగస్ పట్టాలు ఉంటే చర్యలు తప్పవన్నారు. నిజంగా నిరుపేదలైన కార్మికులు ఉంటే తప్పకుండా పట్టాలు మంజూరు చేసి ఇళ్ల నిర్మాణం చేపడుతామన్నారు. అయితే కార్మిక సంఘం నాయకుల చేతుల్లో మోసపోయి నకిలీ పట్టాలు ఉంటే అలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. నిజమైన లబ్దిదారునికి ఇంటి స్థలంతోపాటు పక్కా గృహాలు మంజూరు చేయాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. భవన నిర్మాణ కార్మికుల ఇళ్ల స్థలాల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలతో పరిశీలించామన్నారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులు పరిశీలించి నివేదిక ఆధారంగా అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామన్నారు. భవన నిర్మాణ కార్మికులు స్థలాల్లో అత్యంత ధనికులు, పట్టాలు పొందారని వారు కూడా పేదలకు నకిలీ పట్టాలు సృష్టించి క్రయ విక్రయాలు చేసి లక్షల రూపాయలు సొమ్ము చేసుకున్నారన్నారు. పట్టాలు పొందిన ప్రతి ఒక్క లబ్దిదారునిపై సమగ్ర విచారణ చేపట్టి అర్హులైన వారికి పట్టాలతోపాటు పక్కా గృహ నిర్మాణాలు అందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. వారం లోగా సమస్యను పరిష్కరించానలి రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

## గోవులను రోడ్డు ప్రమాదాల నుంచి రక్షించండి



గోవుకు చికిత్స చేస్తున్న సేవా సమితి సభ్యులు

**కదిరి, అక్టోబర్ 23 ప్రభాతవార్త**

పట్టణంలో ప్రతి రోజు నిత్యం గోవులు రోడ్డు ప్రమాదాల భారిన పడి గాయాల పాలు అవుతున్నాయని, ప్రమాదాల నుంచి గోవులను రక్షించాలని శ్రీఖాద్రి లక్ష్మినరసింహస్వామి సేవా సభ్యులు లక్ష్మణ్ కుటాల పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని కాలేజ్ సర్కిల్ కూడలిలో ఒక ఎద్దును గుర్తు తెలియని వాహనం ఢీ కొని పోవడంతో కాలుకు తీవ్ర గాయమై రక్తస్రావం అవుతున్న ఎద్దును చూసి స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సేవా సమితి సభ్యులకు సమాఆచరం అందించడంతో స్పందించిన సేవా సమితి సభ్యులు పశువైద్యాధికారులకు సమాచారం అందించి వెంటనే ఎద్దుకు శస్త్రచికిత్సలు అందించారు. మూగ జీవాలు రోడ్డున పడి ప్రమాదాలలో మృతి చెందుతున్నాయని, మరికొన్ని గాయాలతో ఇబ్బందిపడుతున్నాయని, అధికారులు ప్రజా ప్రతినిధులు పట్టణ ప్రముఖులు స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పట్టణంలో గోశాలను ఏర్పాటు చేయాలని వారు కోరారు.

## స్మశానవాటిక ఆధునీకరణకు ఏర్పాట్లు ముమ్మరం

**తాడిపత్రిటౌన్, అక్టోబర్ 23 ప్రభాతవార్త**



స్మశానవాటికను పరిశీలిస్తున్న దృశ్యం

పట్టణ సమీపంలోని పెన్నానది తీరాన వెలసిన శ్రీబుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద వున్న హిందూ స్మశాన వాటిక ఆధునీకరణకు మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా జె.సి ప్రభాకర్‌రెడ్డి దాదాపు 2 కోట్ల రూపాయల సొంత ఖర్చుతో స్మశానవాటికలో ఆధునిక వసతులతో గదుల నిర్మాణంతో పాటు గ్రీనరీ, 30 అడుగుల శివుని విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. గ్రీనరీకి సంబంధించి రాజమండ్రి వారిచే గురువారం మార్కింగ్ వేయించారు. ఆయా పనులను జె.సి ప్రభాకర్‌రెడ్డి దగ్గరుండి పర్యవేక్షించారు. అలాగే రాజమండ్రికి చెందిన వారిచే స్మశానవాటిలో 30 అడుగుల శివుని విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు ఎస్‌వి రవీంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అవార్డు అందుకున్న బొల్ల మారుతీప్రసాద్



అవార్డు అందుకుంటున్న మారుతిప్రసాద్

**పెద్దవడుగూరు, అక్టోబర్ 23 ప్రభాతవార్త**

విద్యారంగంలో విశేష కృషి చేస్తున్న మండల కేంద్రంలోని శ్రీసరస్వతి హైస్కూల్ కరస్పాండెంట్ బొల్ల మారుతీప్రసాద్ ఎడుఐకాన్ 2025 అవార్డును అందుకున్నారు. ఈ ఏడాది స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్, నిషా అపుస్మా, ట్రస్మాతో కలసి మల్ల బ్యూరో ఆఫ్ చైల్డ్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ వారు దేశవ్యాప్తంగా అందించే ఎడుఐకాన్ 2025 అవార్డును గురువారం విశాఖపట్టణంలోని హోటల్ ఫెయిర్ ఫీల్డ్ మ్యారియట్‌లో విశాఖపట్టణం పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి భరత్, నిసా అధ్యక్షులు కులభూషణ్‌శర్మ, అపుస్మా చీఫ్ మెంటర్ క్రిష్ణారెడ్డి, మల్లు బ్యూరో అధ్యక్షులు మల్లు రామునాయుడు, మల్లు శ్రీవాణి చేతులమీదుగా మారుతిప్రసాద్ అవార్డు అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత మారుతీప్రసాద్‌కు మిత్రులు, బంధువులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలియచేశారు.

## రుద్రాక్షల అలంకరణలో బుగ్గరామలింగేశ్వరుడు

**తాడిపత్రిటౌన్, అక్టోబర్ 23 ప్రభాతవార్త**

తాడిపత్రి పట్టణ సమీపంలోని పెన్నానది తీరాన వెలసిన శ్రీబుగ్గరామలింగేశ్వరస్వామి గురువారం రుద్రాక్షల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్తీకమాసం రెండవ రోజు పురస్కరించుకుని ఉదయం ఆలయ అర్చకులు మహేష్‌శర్మ, రవిశర్మ, గంగాధర్‌శర్మలు స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పూలమాలలతో పాటు రుద్రాక్షలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ రామాంజనేయులు, ఆలయ కమిటీ చైర్మన్ చంద్రమోహన్, కమిటీ సభ్యులు రంగనాథరెడ్డి, సిబ్బంది విజయ్, తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో ఎన్‌టిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం

**తనకల్లు, అక్టోబర్ 23 ప్రభాతవార్త**



ఎన్‌టిపి సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న మండల విద్యాధికారి

తనకల్లు మండల కేంద్రంలో గురువారం మండల విద్యాశాఖ అధికారి చేతుల మీదుగా ఎన్‌టిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. తనకల్లు మోడల్ ప్రైమరీ స్కూల్, నల్లగుట్లపల్లి, బొంతల పల్లి, చీకటిమానుపల్లి, మార్పురివాండ్లపల్లి, ముత్యాల వాండ్లపల్లి గ్రామాల్లో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ సభ్యత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అదనపు కార్యదర్శి పి.శివశంకర్ మాట్లాడుతూ సకాలంలో పిఆర్‌సి, డిఎ, అరియర్స్ సరెండర్ లీవులు మంజూరు చేయాలని తెలియజేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన డిఎ పట్ల కూటమి ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు అందరూ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి లలితమ్మ, మండలంలోని వివిధ గ్రామాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 26న ఉచిత వైద్యశిబిరం



మాట్లాడుతున్న సోమేశ్వర భార్గవచంద్ర

**అమడగూరు, అక్టోబర్ 23 ప్రభాతవార్త**

మండలంలోని మహమ్మదాబాద్ గ్రామంలో ఈ నెల 26వతేదీ ఆదివారం స్థానిక ఆడిట్ కార్యాలయంలో రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి తిరుపతి వారు ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నారు. జానపద వృత్తి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో హిందూ ధర్మ ప్రచార భజన కళాకారుల ఆధ్వర్యంలో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా భజన కళాకారుల కార్యదర్శి సోమేశ్వర భార్గవచంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గురువారం మాట్లాడుతూ ఈ ఉచిత వైద్య శిబిరాన్ని మండలంలోని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్యశిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉద్యోగులకు హెల్త్ స్కీం, జర్నలిస్టులకు హెల్త్ స్కీం ద్వారా అర్హులైన వారికి తిరుపతి రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఉచితంగా ఆపరేషన్లు చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భజన కళాకారులు నరసింహులు, వెంకటరమణ. ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## బియ్యం సరఫరా చేసే వాహనంలో బ్యాటరీ చోరీ

- పట్టించుకోని రెవెన్యూ సిబ్బంది




బ్యాటరీ చోరీకి గురైన వాహనం

**అమడగూరు, అక్టోబర్ 23 ప్రభాతవార్త**

అమడగూరు మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఆవరణంలో నిలిపి వున్న బియ్యం సరఫరా చేసే వాహనంలో గుర్తుతెలియని వ్యక్తులు బ్యాటరీ చోరీ చేశారని వాహన యజమాని ఆవేదన వ్యక్తం చేశారు. తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో నిలిపి వున్న వాహనంలోనే చోరీ జరిగిందంటే ఇక సామాన్యుల పరిస్థితి ఎలా అని వాహనదారుడు లబో దిబో మంటున్నాడు. దీనిపై రెవిన్యూ సిబ్బంది చర్యలు తీసుకోవాలని వాహన యజమాని కోరుతున్నాడు.

## భూమి పూజకు తరలిరండి



ఏర్పాట్లు చేపడుతున్న దృశ్యం

**అమడగూరు, అక్టోబర్ 23 ప్రభాతవార్త**

అమడుగూరు మండల కేంద్రంలోని జెడ్‌పిహెచ్ పాఠశాల ఆవరణం వద్ద శుక్రవారం ఉదయం 8 గంటలకు నూతనంగా ఏర్పాటు చేస్తున్న శ్రీవాల్మీకి మహర్షి విగ్రహావిష్కరణ భూమిపూజకు మండలంలోని వివిధ గ్రామాల వాల్మీకి కుటుంబసభ్యులు హాజరుకావాలని నిరుగట్టి రవిశంకర్, చెవుటి నరసింహులు, మనికాయలు ఆంజనేయులు, జవుకుల ఆది, అశ్వత్థ, సోము, వెంకటశివ, మద్దె కేశవ, నాగరాజు, గుడ్ల ఆంజనేయులు, సోము, ఉత్తప్ప, ఆకులవారిపల్లి శంకర, సోము, చినగానపల్లి ఆది, రవి, మంజు, శివ, బొట్టుస్వామి, వనం శీనా, సోలుకుంట్ల ఈశ్వరప్ప, కంచినగారిపల్లి ఆంజనేయులు, సుధాకర్‌లు పిలుపునిచ్చారు.

## ఆగి ఉన్న లారీలో మృతదేహం లభ్యం

**అనంతపురం రూరల్, అక్టోబర్ 23 ప్రభాతవార్త**




ఆగి ఉన్న లారీలో మృతి చెందిన వ్యక్తి

అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి పరిధిలోని హెచ్ పి పెట్రోల్ బంక్ సమీపంలో ఆగి ఉన్న ఓ లారీలో మృత దేహం ఉన్నట్లు గుర్తించిన రూరల్ పోలీసులు. నైట్ బీట్ పోలీసులు పెట్రోలింగ్ చేస్తూ ఆగి ఉన్న లారీని పరిశీలించగా అందులో మృత దేహం ఉన్నట్లు అతను డ్రైవర్ కమ్ ఓనర్ అని, తమిళనాడు రాష్ట్రం శంకగిరి తాలూకాకు చెందిన వెంకటాచలంగా గుర్తించామని, మృతుడి బంధువులతో మాట్లాడి విషయం తెలపగ అతనికి అనారోగ్య సమస్యలున్నాయని మృతికి గుండెపోటు కారణమని ప్రాథమిక విచారణలో తెలుసుకున్నమని మృతదేహంపై ఎలాంటి గాయాలు ఏమీ లేకపోవడంతో మృతికి కారణాలు స్పష్టం కాలేదని అయినప్పటికీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామని అనంతపురం రూరల్ సి.ఐ శేఖర్, ఎస్సై రాంబాబు తెలిపారు.

## వ్యక్తి అరెస్ట్

**పెద్దవడుగూరు, అక్టోబర్ 23 ప్రభాతవార్త**

మండలంలోని గుత్తి అనంతపురం గ్రామ రెవెన్యూ పొలంలో సర్వేనంబర్ 317లోని 1.35 ఎకరాల మిగులు భూమిని పామిరెడ్డి శంకర్‌రెడ్డి, పామిరెడ్డి లక్ష్మినారాయణరెడ్డిలకు అనువంశికంగా రాగా పామిరెడ్డి లక్ష్మినారాయణరెడ్డి కుమారుడు పామిరెడ్డి మధుసూదన్‌రెడ్డి ఒక ఫోర్జరీ డాక్యుమెంట్ తయారు చేసి 2022లో తహశీల్దార్ కార్యాలయంలో ఆ డాక్యుమెంట్ ద్వారా ఆ భూమిని ఆన్‌లైన్ చేసుకొని బ్యాంకులో లోన్ తీసుకున్నాడని పామిరెడ్డి శంకర్‌రెడ్డి కుమారుడు యతిష్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పామిరెడ్డి మధుసూదన్‌రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం పామిరెడ్డి మధుసూదన్‌రెడ్డిని హైదరాబాదులో అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

## ఆటో నగర్ ఏర్పాటుకు కృషి చేస్తా

- ఎమ్మెల్యే కందికుంట



ఆటో కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

**కదిరి, అక్టోబర్ 23 ప్రభాతవార్త**

పట్టణంలో ఆటో నగర్ ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఆర్డిఓ కార్యాలయంలో ఆటో నగర్ ఏర్పాటు చేయాలని మెకానికల్, ఇంజినీరింగ్ వర్క్స్ యూనియన్ సభ్యులు ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గతంలో ఎంత మంది పాలకులు మారినా తమ సమస్యను పరిష్కరించలేదని తమకు ప్రత్యేకంగా కదిరి పట్టణంలో ఆటో నగర్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే స్పందించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆటో నగర్ స్థలాన్ని కేటాయించడం జరుగుతుందని భరోసా ఇచ్చారు. ఆటో నగర్ ఏర్పాటుకై స్థల పరిశీలన చేయాలని ఎమ్మెల్యే రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## ఈనెల 28న జరిగే ర్యాలీలో అందరూ భాగస్వాములు కావాలి

- ఎం ఎస్ ఎస్ సాదిక్



వైఎస్ఆర్సిపి ప్రజా ఉద్యమ పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

**అనంతపురంరూరల్ , అక్టోబర్ 23 ప్రభాతవార్త**

ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్ఆర్‌సీపీ ప్రజా ఉద్యమంపై రూపొందించిన పోస్టర్‌ను అనంతపురంలో ప్రజా ప్రతినిధులు, వైసీపీ నాయకులతో కలిసి ఆవిష్కరించిన వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ విజయవంతంగా, కొనసాగుతోందని,ఈనెల 28వ తేదీన నియోజకవర్గ, కేంద్రాల్లో ర్యాలీలుచేపడుతుందని,వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలల నిర్మాణం చేపట్టి 5 అందు బాటులోకి తెచ్చారు. మరో రెండు కళాశాలలు,ప్రారంభానికి సిద్ధంగా ఉంచామని, అయితే చంద్రబాబు సీఎం అయ్యాక రాష్ట్రంలో 10 కళాశాలల కట్టబెట్టేందుకు జీవో కూడా ఇచ్చారని ప్రజాధనం, ప్రభుత్వ ఆస్తులను నిలువు దోపిడీ చేయడం కోసమే పీపీపీ పేరుతో చంద్రబాబు భారీ స్కాంకు తెర తీస్తున్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలోనే మెడికల్ కళాశాలలు ఉంచాలన్న డిమాండ్‌తో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆదేశాలతో అనంత జిల్లా అధ్యక్షుడు అనంత నాయకత్వంలో ప్రజా ఉద్యమం చేపడుతూ 28న జరిగే ర్యాలీలో రుద్రంపేట పంచాయతీలోని వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు, విద్యార్థులు,యువత పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వైయస్సార్సీపి పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర జాయింట్ కార్యదర్శి ఎంఎస్ఎస్ సాధిక్ పిలుపునిచ్చారు. ప్రభుత్వమెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ఆపే వరకు వైయస్ఆర్‌సీపీ పోరాటం కొనసాగుతుందని అయన తెలిపారు.

## అనంతపురము జిల్లా మండల పరిషత్ అభివృద్ధి అధికారుల నూతన కార్యవర్గము ఎంపిక



నూతన కార్యవర్గ సభ్యులుగా ఎంపికైన అధికారులు

**అనంతపురం రూరల్, అక్టోబర్ 23 ప్రభాతవార్త**

అనంతపురం జిల్లా, మండల పరిషత్ అభివృద్ధి అధికారుల నూతన కార్యవర్గమును గురువారం ఎంపిక చేశారు. గౌరవ అధ్యక్షులు,జి.శివ శంకర్ సీఈఓ జిల్లా ప్రజా పరిషత్,అనంతపురము, అధ్యక్షులు,రవి ప్రసాద్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, ఉరవకొండ మండలము,ఉపాధ్యక్షులు బి.విజయలక్ష్మి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, రాప్తాడు మండలము, జనరల్ సెక్రటరి,డి.ప్రభాకర్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, గుత్తి మండలము,జాయింట్ సెక్రటరిపి.సౌజన్యకుమారి, డిస్ట్రిక్ట్, కోఆర్డినేటర్, డిపిఆర్సి,అనంతపురము, ట్రెజరర్ గా బి. విజయ్ భాస్కర్, మండల పరిషత్అభివృద్ధిఅధికారి,బొమ్మనహల్, రాష్ట్ర ప్రతినిధిగా పి. దివాకర్, మండలపరిషత్అభివృద్ధిఅధికారి,అనంతపురము రూరల్, కార్య నిర్వాహణ సభ్యులుగా రాప్తాడు,లక్ష్మి నరసింహశింగనమల, ఐ.మమతాదేవి, ఉరవకొండ పి.కుళ్ళాయస్వామి,తాడిపత్రి,వీరరాజు, కల్యాణదుర్గం, వి.ధనుంజయ, రాయదుర్గం,బి.విజయభాస్కర్,గుంతకల్,కె. తేజోత్స్న తదితరులు కార్యనిర్వహణ సభ్యులుగా ఎంపిక చేయడం జరిగిందన్నారు.

## ప్రధాన రహదారిపై నీటికుంటలు

- ఆదమరిస్తే అంతే సంగతులు



రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

**ఓబుళదేవరచెరువు, అక్టోబర్ 23, ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద కదిరి-హిందూపురం ప్రధాన రహదారిపై భారీ గోతి ఏర్పడి నీటి కుంటను తలపిస్తోంది. కొద్దిపాటి వర్షం వస్తే చాలు వడ్డివారిపల్లి నుండి స్టేట్ బ్యాంకు వరకూ రోడ్డుపై ఏర్పడ్డ గోతులు నీటి ఉపకుంటలను తలపిస్తూ ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. మండల వాసులకు ఈ రహదారి అవగాహన ఉడడంతో ఇబ్బందిలేదు కాని కొత్త వ్యక్తులు ఆదమరిస్తే అసుపత్రికి వెళ్లాల్సిందే. ఈ రహదారిపై ద్విచ క్రవాహన దారులు పడిలేచి గాయాలపాలైన సందర్భాలు అనేకం. నిత్యం ఈ రహదారిపై తహశీల్దార్ కారా ్యలయం, ఎంపిడిఓ కార్యాలయాల అధికారులు, ప్రజాప్రతినిధులు వెళుతున్నా వారి కార్లు నీటిలో పడి వాలి తూలుతున్నా పట్టించుకోకుండా వెళుతున్నారన్న విమర్శలు లేకపోలేదు. పత్రికల్లో కథనాలు వచ్చినప్పుడు మాత్రమే అధికారులు స్పందించి రోడ్డుపై నామ మాత్రంగా పనులు చేయిస్తున్నారని, సిమెంట్ రోడ్డు ఏరా ్పటు చేసి శాశ్విత పరిష్కారం చూపాలని మండల వాసులు, ప్రజా సంఘాలు కోరుకుంటున్నారు.

## మండలానికి నలుగురు పంచాయితీ కార్యదర్శులు బాధ్యతలు

రామగిరి, అక్టోబర్ 23 ప్రభాతవార్త

రామగిరి మండలానికి పంచాయితీ కార్యదర్శులు నలుగురు గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. మండలానికి కొన్ని రోజులుగా పంచాయితీ కార్యదర్శిలు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం జరిగిన బదిలీల్లో మండలానికి ఐదుగురు రాగా ఇందులో నలుగురు గురువారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. పోలేపల్లి పంచాయితీకి భాస్కర్, ఎంసిపల్లికి వెంకటరమణ, కుంటిమద్దికి చంద్రకాంత్, మాదాపురంకు జగదీష్‌లు బాధ్యతలు చేపట్టగా వీరికి ఎంపిడిఓ గంగావతిని పదవీ బాధ్యతలు సక్రమంగా చేపట్టి ప్రజలకు అందుబాటులో ఉండి వారిర సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సూచించారు.

## మా గ్రామాలను మున్సిపాలిటీలోకి విలీనం చేయవద్దు

### మున్సిపల్ కమిషనర్ కు విన్నవించిన పలుగ్రామాల ప్రజలు



మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం అందజేస్తున్న పలుగ్రామాల ప్రజలు, టీడీపీనాయకులు

ధర్మవరంటౌన్, అక్టోబరు 23 ప్రభాతవార్త

ధర్మవరం మండల పరిదిలోని పలు గ్రామాలను మున్సిపాలిటీలోకి విలీనం చేయవద్దని ఆయాగ్రామల ప్రజలు, టీడీపీ నాయకులు మున్సిపల్ కమిషనర్ సాయికృష్ణ, టౌన్ ప్లానింగ్ అధికారిణి అలివేళమ్మలకు వినతి పత్రం అందజేశారు. గురువారం పోతులనాగేపల్లి, తుంపర్తి కాలనీ, రేగాటిపల్లి, కుణుతూరు, పోతుకుంట బీసీకాలనీల ప్రజలతో పాటు ధర్మవరం మండల టీడీపీనాయకులు చింతలపల్లిమహేశ్ చౌదరి, పురుషోత్తం గౌడ్, పోతుకుంట లక్ష్మన్న, విజయసారధిచౌదరి, గొట్లూరు శీన, పోతుకుంటరవి, పోతుకుంటరమేశ్, పోతుల నాగేపల్లి ఆదెప్ప, పోతలనాగేపల్లి ప్రసాద్, భాస్కర్, అమర సుధాకర్ నాయుడు, తలారి వెంకటలక్ష్మి, తదితరులు మున్సిపల్ అధికారులను కలిసి సమస్యను విన్నవించారు. తాము గ్రామాలలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు ఉన్నపలంగా మా గ్రామాలను మున్సిపాలిటీలోకి విలీనం చేయాలన్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. తాము మున్సిపాలిటీల్లో ఇంటి, నీటి, ఇంటినిర్మాణం కోసం విదించే పన్నులు కట్టలేమన్నారు.

## వ్యవసాయ కార్యాలయంలోరైతులకు జిప్సం పంపిణీ ప్రారంభం

అమరాపురం అక్టోబర్ 23 ప్రభాతవార్త



పంపిణీ ప్రారంభిస్తున్న దృశ్యం

మండల కేంద్రమైన అమరాపురం వ్యవసాయ కార్యాలయం నందు గురువారం వ్యవసాయ అధికారి మంజునాథ్ సమక్షం లో టిడిపి మండల కన్వీనర్ కృష్ణమూర్తి, టిడిపి ప్రధాన కార్యదర్శి నాగరాజు, పార్లమెంట్ తెలుగువత ఉపాధ్యక్షుడు రఘు తదితరులు పాల్గొని రైతులకు జిప్సం ఎరువులు పంపిణీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సింగల్ విండో డైరెక్టర్ దాదా పీర్, చెరువు సంఘం అధ్యక్షుడు గురు సిద్ధప్ప, మండల డీలర్ల సంఘం ఉపాధ్యక్షుడు స్టూడియో హనుమంతు, డీలర్ నాగరాజు, హూలి రాజు, నాయకులు మద్దనకుంట ఎంజారప్ప, ఈర్ముద్దన్న, మల్లికార్జున, మాజీ డీలర్ శ్రీనివాస్, మహాలింగప్ప మరియు వ్యవసాయ శాఖ రైతు సేవా కేంద్రం అధికారులు మోహన్ తదితరులు పాల్గొన్నారు. మండల పరిధిలోని అమరాపురం, తమ్ముడేపల్లి, హ లుకూరు రైతు సేవ కేంద్రాల్లో జిప్సం 200 బ్యాగులు అందుబాటులో ఉన్నట్లు ప్రతి రైతుకు జిప్సం ఒక బ్యాగు వంతన పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి మంజునాథ్ తెలిపారు. ప్రభుత్వం నుండి రైతులకు రాయితీల ద్వారా ఎరువులను పంపిణీ చేయనున్నట్లు కన్వీనర్ కృష్ణమూర్తి తెలిపారు.

## అంబేడ్కర్, జగజీవన్ రామ్‌ల విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం విజయవంతం చేయండి..

### మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి.

మడకశిర టౌన్,అక్టోబర్ 23 ప్రభాతవార్త.

డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్ రావ్ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సూచించారు. గురువారం పట్టణంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు టిడిపి నాయకులు కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సమావేశం నిర్వహించారు. తొలత బేగార్లపల్లి వద్ద స్థల పరిశీలన చేసి అనంతరం సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఈనెల 27 వ తేదీన బేగార్లపల్లి లో బాబా సాహెబ్ అంబేడ్కర్, బాబు జగజీవన్ రావ్ ల విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి 15 మంది శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులు హాజరవుతున్నారు అన్నారు. ఈ సందర్భంగా భారీ సంఖ్యలో నాయకులు హాజరై విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరసింహరాజు, కౌన్సిలర్లు సుభద్ర నాగేంద్ర, ఉమాశంకర్, మేఘన రమేష్, కన్వీనర్లు, క్లస్టర్ ఇంచార్జిలు, ప్రధాన కార్యదర్శులు, తిమ్మరాజు, ప్రజా ప్రతినిధులు అన్ని అనుబంధ సంఘాల నాయకులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించినప్పుడే ప్రమాదాలు జరగవు

బత్తలపల్లి, అక్టోబర్ 23 ప్రభాతవార్త



వాహనదారులతో మాట్లాడుతున్న ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్

రోడ్డుపై వాహనాలు నడిపేటప్పుడు వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ సరిగా పాటిచ్చినట్లయితే ప్రమాదాలు జరగకుండా చూసుకోవచ్చునని ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్ అన్నారు. గురువారం సాయంత్రం సిబ్బంది తో కలసి సీఐ ప్రభాకర్ గుమ్మళ్లకుంట టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. వాహనదారుల రికార్డులు సరిచూసి రికార్డులు సరిగా లేని వాహనదారులుకు జరిమానా విధించారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. ఈ తనిఖీలలో సిబ్బంది పాల్గొన్నారు.

## అమరాపురంలో 4 లైన్ రోడ్డు ఏర్పాటుకు ప్రతిపాదనలు

### పరిశీలించిన ఆర్ అండ్ బి అధికారులు

### ఆర్అండ్‌బి పరిథిలోని భవనాల పరిశీలన

అమరాపురం అక్టోబర్ 23 ప్రభాతవార్త



అమరాపురం మెయిన్ రోడ్డు దృశ్యం

మండల కేంద్రమైన అమలాపురం పట్టణం నందు తహసిల్దార్ కార్యాలయం సమీపంనుండి ప్రధాన రహదారినీ, ఇందిరమ్మకాలోనీ వరకు 4 లైన్ రోడ్డును ఏర్పాటుచేయడానికి ప్రతిపాదనలను సిద్ధం చేసినట్లు ఆర్ అండ్ బి డిఈ లక్ష్మీనారాయణ, ఆర్ అండ్ బిఏఈ నరసింహమూర్తిలు తెలిపారు. ముఖ్యంగా అమరాపురం పట్టణంలో ఆర్అండ్‌బి రోడ్డు పరిధిలో అక్రమంగా నిర్మించుకున్న భవనాలను గురువారం పరిశీలించారు. గతవారం క్రితం అమరాపురం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ లో 50లక్షలతో సిసి రోడ్డు నిర్మాణం, అంబేద్కర్ స్మృతివనం ప్రహరీ గోడనిర్మాణమునకు 17 లక్షల ఎంపి గ్రాంటు నిధుల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న హిందూపురం ఎంపీ పార్థసారథి, మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి లు అమరాపురం పట్టణంలో 4 లైన్ రోడ్డు ఏర్పాటు చేస్తామని ప్రకటించడం విధితమే. అందులో భాగంగా ప్రధాన రోడ్డును ఆర్ అండ్ బి అధికారులు గురువారం పరిశీలన చేయడం జరిగింది. ముఖ్యంగా పట్టణంలోనాలుగు లైన్ల రోడ్ల ఏర్పాటు మరియు డ్రైనేజ్ వసతి మరియు సెంటర్ లైటింగ్ తో పాటు డివైడర్ల ఏర్పాటు చేయడం వంటి పనులకు ప్రతిపాదనలను పంపడం జరిగిందని ఆర్ అండ్ బి అధికారులు తెలిపారు. ఇరుకున ఉన్న ప్రధాన రహదారిని ఫోర్ లైన్ చేయడానికి మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు అధికారుల ద్వారా పరిశీలన చేపట్టడం పట్ల వాహన చోదకులు ప్రజలు సత్వరమే అమరాపురం పట్టణ రూపురేఖలు మారుతాయని చర్చించుకోవడం గమనార్హం. ఈ కార్యక్రమంలో అధికారుల వెంట టిడిపి మండల కన్వీనర్ కృష్ణమూర్తి, మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు, పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు రఘు, సీనియర్ నాయకులు మారుతి ప్రసాద్, సింగల్ విండో డైరెక్టర్ దాదా పీర్, మద్దనకుంట ఎంజారప్ప, మండల డీలర్ల సంఘం ఉపాధ్యక్షుడు స్టూడియో హనుమంతు, మాజీ సర్పంచ్ శకునప్ప తదితరులు పాల్గొన్నారు.

## రైతుసంఘం మండల నూతన కమిటీ ఎన్నిక




నూతనంగా ఎన్నికైన సభ్యులతో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు విరుపాక్షి


వజ్రకరూరు అక్టోబర్ 23 ప్రభాతవార్త

వజ్రకరూరు రైతుసంఘం మండల నూతనకమిటీని గురువారం ఎన్నుకున్నట్లు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు విరుపాక్షి తెలిపారు. ముందుగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పండిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడంలో రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని, రైతుల భూములు కార్పొరేట్లకు కట్టబెట్టడానికి జిల్లాలో మండలంలో సోలార్ పేరుతో కార్పొరేట్లకు కట్టబెట్టడానికి ప్రభుత్వాలు ఆదేశాలు ఇవ్వడం రైతులకు తీవ్ర అన్యాయం చేయడమే అన్నారు. మండలంలో పిల్ల కాలువలను పూర్తి చేసి హంద్రీనీవా నీటిని ప్రతి ఎకరాకు అందించాలన్నారు. పండిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల అధ్యక్షులుగా ఓబులపతి ప్రధాన కార్యదర్శిగా సుధాకర్ కమిటీ సభ్యులుగా చిన్న పెద్దన్న లక్ష్మయ్య రంగయ్య భాషాలను ఏకిగ్రీవంగా ఎన్నుకున్నట్లు అయనతెలిపారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ రైతు సమస్యలపై నిరంతరం పోరాటం చేసి ప్రభుత్వాలు వారికి న్యాయం చేసేలా కృషి చేస్తామన్నారు కృషి చేస్తామన్నారు.

## సకాలంలో జీతాలు అందించండి

### అధికారులకు విన్నవించిన సాంకేతిక సహాయకులు

పుట్టపర్తి టౌన్, అక్టోబర్ 23, ప్రభాతవార్త



అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న సాంకేతిక సహాయకులు

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న తమకు సకాలంలో జీతాలు అందించాలని సాంకేతిక సహాయకులు అధికారులకు విన్నవించారు. శ్రీ సత్య సాయి జిల్లాలోని వివిధ ప్రాంతాలలో జాతీయ ఉపాధి హామీ పథకం నందు పనిచేస్తున్న సాంకేతిక సహాయకులకు సక్రమంగా జీతాలు అందడం లేదంటూ గురువారం డ్వామా ఇన్చార్జి పిడి శ్రీలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని కొంతమంది సాంకేతిక సహాయకులకు గత నాలుగు నెలల నుంచి జీతాలు అందడం లేదని, కొందరికి సెప్టెంబర్ నుంచి జీతాలు పడడం లేదని వాపోయారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న తమ పై అధికారుల ఆదేశాల మేరకు ప్రతి పనిని అందరిని కోఆర్డినేషన్ చేసుకొని విధి నిర్వహణలో మా పనులు చేస్తున్నప్పటికీ, మాలో కొందరికి సకాలంలో జీతాలు అందడం లేదని ఎందుకు ఇలా జరుగుతుందో తెలియడం లేదంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు తమపై చిన్న చూపు చూడడం ఆందోళనకరంగా ఉందని, జీతాలు సక్రమంగా రాకపోవడంతో కుటుంబ నిర్వహణ కష్టంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే డిపార్ట్మెంట్ నందు పనిచేయుచున్న ఉపాధి హామీ సిబ్బంది లో ఒక్కొక్కరికి ఒక్కొక్క విధంగా జీతభత్యాలు అందుతున్నాయని, కొందరిపై నిర్లక్ష్యం చూపుతూ మానసిక క్షోభకు గురి చేస్తున్నారన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులతో చర్చించి తమకు న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశారు.

## కూటమి ప్రభుత్వంలో మహిళలకు కరువైన రక్షణ...

మడకశిర టౌన్ అక్టోబర్ 23 ప్రభాతవార్త.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రవి శేఖర్ రెడ్డి

నిన్నటి రోజున తుని లో 9 ఏళ్ల మైనర్ బాలికపై కూటమి ప్రభుత్వానికి సంబంధించిన టిడిపి మాజీ కౌన్సిలర్ హాస్టల్ లో ఉన్న అమ్మాయిని తన తాత అని చెప్పి బయటకు తీసుకువచ్చి అత్యాచారయత్నానికి ప్రయత్నించడం అత్యంత దురదృష్టకరమైన చర్య. ఇదే కాక 14 నెలల క్రితం నంద్యాల జిల్లా మచ్చుమర్రి లో మైనర్ బాలికను అత్యాచారం చేసి హత్య చేసిన ఘటనలో బాలిక శవాన్ని కూడా ఇప్పటి వరకు గుర్తించలేకపోయారు. కూటమి ప్రభుత్వ వైఫల్యానికి ఇది ప్రత్యక్ష నిదర్శనం అని అన్నారు. మహిళలపై అత్యాచారాలు దౌర్జన్యాలు జరుగుతున్న కూడా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా నోరు మెదపడం లేదని అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ముప్పైవేల మంది బాలికలు మిస్ అయ్యారని అబద్ధపు అభాండాలు వేసిన డెప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఈ విషయంలో నోరు మెదపకపోవటం ఆయన ప్యాకేజీ రాజకీయాలకు అద్దం పడుతోంది అని అన్నారు.

## రాకెట్ల తండాలో తీవ్రమైన తాగునీటి సమస్య..!

### -వారం రోజులుగా అష్టకష్టాలు పడుతున్న ప్రజలు

ఉరవకొండ, అక్టోబర్ 23 ప్రభాతవార్త



రాకెట్ల తండాలో చేతి పంపులోకి మోటారు పెట్టి నీటిని తోడుకొంటున్న గ్రామస్థుల దృశ్యం

మండల పరిధిలోని రాకెట్ల తండా గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రమైంది. గ్రామంలో నీటిని సరఫరా చేసే పంచాయతీ మోటారు కాలిపోవడం, చేతి పంపు సైతం చెడిపోవడంతో వారం రోజులుగా ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. సమస్యను గ్రామస్థులు అనేక మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతో చేసేదేమీ లేక చెడిపోయిన చేతి పంపు పై భాగాన్ని తొలగించిన గ్రామస్థులు అందులో పైపు వేసి ఒక హెచ్‌పీ సామర్థ్యంగల మోటారుతో అతికష్టం మీద నీటిని తోడుకొని దాహం తీర్చుకొంటున్నారు. గ్రామంలో 120 కుటుంబాలు ఉన్నాయని చేతి పంపుకు మోటారు పెట్టుకొని నీటిని తోడుకొంటున్నా కనీసం 20 బిందెల నీళ్లు కూడా రావడం లేదని వాపోతున్నారు. దీపావళి పండుగను తండాలో ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని అయితే నీటి ఎద్దడితో ఈ ఏడాది పండుగ సంబరాలు కూడా కరువయ్యాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి మోటారు, చేతి పంపును మరమ్మతులు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరించాలని తండా ప్రజలు కోరుతున్నారు.

## కుంగిన జాతీయ రహదారికు మరమ్మతులు..!

### -ప్రమాదాలు జరుగకుండా రోడ్డును చదును చేయించిన హైవే అధికారులు

ఉరవకొండ, అక్టోబర్ 23 ప్రభాతవార్త

వార్త ప్రభావం



కొట్టాలపల్లివద్ద అనంతపురం-బళ్లారి 42వ నంబర్ జాతీయ రహదారి కుంగిన ప్రదేశంలో మరమ్మతులు చేసిన దృశ్యం

విడపనకల్లు మండలం పెద్ద కొట్టాలపల్లి గ్రామ సమీపంలో కుంగిపోయిన అనంతపురం-బళ్లారి 42వ నంబర్ జాతీయ రహదారికు హైవే అధికారులు మరమ్మతులు చేయించారు. జాతీయ రహదారి ఒకచోట కుంగిపోవడంతో రాకపోకలు సాగించే చిన్న, పెద్ద వాహనాలు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నా హైవే అధికారులు పట్టించుకోవడం లేదని 'వార్త'లో ఈనెల 19వ తేదీన "కొట్టాలపల్లి గ్రామంవద్ద కుంగిన జాతీయ రహదారి..!" అన్న శీర్షికన ప్రత్యేక కథనం వెలువడటంతో అధికారులు స్పందించారు. రోడ్డు కుంగి పోయిన ప్రదేశంలో బీటీ వేయించి వాహనాలు కుదుపుకు లోనుకాకుండా చదును చేయించారు. సమస్యను హైవే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికై కృషి చేసిన 'వార్త'కు వాహనదారులు పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆధార్ నందు పేర్లు తప్పుగా వుంటే సరి చేసుకోండి ఎంఈఓ

బుక్కపట్నం, అక్టోబర్ 23, ప్రభాతవార్త

బుక్కపట్నం మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు ఆధార్ కార్డు నందు పేర్లు తప్పుకుంటే సరి చేసుకోవాలని ఎంఈఓ గోపాల్ నాయక్ సూచించారు. ఎంపీడీవో శ్రీనివాసులు సూచన మేరకు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సంబంధించిన ఆధార్ అప్డేషన్ ను ఈనెల 24వ తేదీన గూనిపల్లి నందు, 25వ తేదీన బుక్కపట్నం లోని కాంప్లెక్స్ నందు, 27వ తేదీన పాముదుర్తి క్లస్టర్ నందు మోడిఫికేషన్, బయోమెట్రిక్ అప్డేట్స్ కానీ విద్యార్థులు తప్పక హాజరై నమోదు చేయించుకోవాలని ఆయన కోరారు. దీనిపై ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రుల్లో చైతన్యం కల్పించాలని సూచించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వారి తల్లిదండ్రులు తప్పక ఉపయోగించుకోవాలని ఎంఈఓ కోరారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ధర్మవరంటౌన్, అక్టోబరు 23 ప్రభాతవార్త

పట్టణంలోని మార్కెట్ యాడ్ సబ్ స్టేషన్ పరిదిలో శుక్రవారం ఉదయం 930గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు విద్యుత్ శాఖ ఏఈ జానకీరామయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్అండ్ బీ అధికారులు రోడ్డు వైడెనింగ్ పనులు చేపట్టడంతో శారదానగర్, చంద్రబాబునగర్, శాంతినగర్ ప్రాంతాలకు విద్యుత్సరఫరా నిలిపివేస్తున్నామని కావున ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

## విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

గుత్తి, అక్టోబర్ 23 ప్రభాతవార్త



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

విద్యార్థులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి ప్రభాకర్ సూచించారు. మండలంలోని రజాపురం, ఏపిడబ్ల్యూఆర్ఎస్ పాఠశాల, సేవాఘడ్‌లోని గిరిజన పాఠశాలలో గురువారం సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధుల పట్ల పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## వైద్య ఖర్చులకు10 వేల రూ ఆర్థిక సాయం

సోమందేపల్లి అక్టోబర్ 23 ప్రభాతవార్త



ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న విజ్ఞాన్ స్కూల్ కరస్పాండెంట్ గౌతమ్

మండల కేంద్రంలోని జడ్పీహెచ్ స్కూల్ లో 9 వ తరగతి చదువుతున్న గౌతమ్ (14) గత 20 రోజులుగా ( బ్లడ్ బ్లాక్ )అయినా కారణంగా బెంగుళూరు ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నా విషయం అందరికి తెలిసినదే, గౌతమ్ తల్లిదండ్రులకు 10000/వేల రూపాయలు వైద్యం ఖర్చులకు స్థానిక విజ్ఞాన్ హై స్కూల్ కరస్పాండెంట్ మల్లికార్జున, ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంఈఓ ఆంజనేయులు నాయక్, చేతుల మీదుగా గౌతమ్ తల్లిదండ్రులకు అందచేశారు. తల్లిదండ్రులు విజ్ఞాన్ స్కూల్ మల్లికార్జున కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌతమ్ తల్లిదండ్రులతో పాటు దుర్గానగర్ కు చెందిన నటరాజ్ ఆచారి ఉన్నారు.

## రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ధర్మవరం విద్యార్థినిల ఎంపిక

ధర్మవరంటౌన్, అక్టోబరు 23 ప్రభాతవార్త



రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపికైన విద్యార్థినిలతో పాఠశాల హెడ్మిస్టర్ సిస్టర్

అనంతపురంలో ఈనెల 7వతేదీన అశోక్ నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఎస్ఎఫ్ జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు జీవన్ జ్యోతి పాఠశాల హెడ్మిస్టర్ సిస్టర్ సుజాత పేర్కొన్నారు. అండర్17 విభాగంలో 9వతరగతి చదువుతున్న ఐశ్వర్య, అతికా, అండర్19 విభాగంలో అక్షిత, జూహాతబుసమ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఆమె తెలిపారు. వీరిని గురువారం పాఠశాలలో ఆమెతోపాటు ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అబినందించారు. ఎంపికైన విద్యార్థినిలు విశాఖపట్నంలో ఈ నెల 25వతేదీ నుంచి 27వతేదీ వరకు జరిగే రాష స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు.

## ఘనంగా ఎస్‌జిఎఫ్ మండలస్థాయి పోటీలు.



ఆటగాళ్లతో ఉపాద్యాయులు

గుడిబండ అక్టోబర్ 23 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఆటలపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ ప్రసాద్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు గోవిందప్ప ఆటలపోటీలను ప్రారంభించారు. ఫెడరేషన్ అండర్ 14, అండర్ 17 బాలుర కబడ్డీ, కో కో, అథ్లెటిక్స్, చెస్, యోగా వంటి పోటీలను నిర్వహించారు. కబడ్డీలో విన్నర్ గా గుడిబండ పాఠశాల జట్టు రన్నర్స్ గా కెఎన్ పల్లి జట్లు నిలిచాయి. కోకో లో గుడిబండ ఉన్నత పాఠశాల జట్టు విన్నర్ గా మోరుబగల్ జట్టు రన్నర్స్ గా నిలిచాయి. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ప్రసాదరెడ్డి, హెచ్ఎం గోవిందప్ప, పీడీలు ఓబులమ్మ, రమాదేవి, బాలునాయక్, లక్ష్మణ్ నాయక్, అజారుద్దీన్, విజయ్ విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు పాఠశాల సిబ్బంది విద్యార్థులు అభినందనలు తెలిపారు.

## ఆంజినేయస్వామి బిటి రోడ్డు నిర్మాణానికి రూ.కోటి మంజూరుపై హర్షం

అగళి, అక్టోబర్ 23 ప్రభాతవార్త

రామనపల్లి ఆంజినేయస్వామి దేవాలయానికి అక్కడ బిటిరోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యేఎంఎస్.రాజు, టిడిపి ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామిలు కోటి రూపాయలు మంజూరు చేయించారని గ్రామం తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు. పట్ల సీనియర్‌తెలుగుదేశం పార్టీ నాయకులు రామనపల్లి ఎస్‌వి చలపతి, మంజు, ప్రకాష్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు. మొత్తం మండలానికి అభివృద్ధికి 3 కోట్లు మంజూరు చేయించారని ఎంపిపి రేణుకా కామరాజు అన్నారు. కరిదాసనపల్లి నుంచి కదిరేపల్లి మెయిన్ రోడ్డు రావుడి ఆంజినేయస్వామి బిటి రోడ్డుకు రూ.1.50 కోట్లు మంజూరు చేయించారని, అగళి బిసి హాస్టల్ కాంపౌండ్ నిర్మాణానికి 20 లక్షలు, మధూడి గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణానికి 30 లక్షలు మంజూరు చేయించారని, మండలానికి 3 కోట్లు మంజూరు చేయించడంపై ఎంపిపి రేణుకా కామరాజు, ఎస్‌వి చలపతి, మండల ప్రజలు హర్షం వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలిపారు.

## సత్తా చాటిన ఆదర్శ పాఠశాల విద్యార్థులు

అగళి, అక్టోబర్ 23 ప్రభాతవార్త



విజయం సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న పిడి నారాయణస్వామి

గురువారం అగళి ఉన్నత పాఠశాలలో ఎస్‌జిఎఫ్ మండల స్థాయి అండర్-14, అండర్-17 బాయ్స్ మీట్‌ను నిర్వహించారు. ఈ పోటీలు ఆదర్శ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. 100 మీటర్ల పరుగు పందెంలో అండర్-14, 17 విభాగంలో మొదటి స్థానం 200 మీటర్లలో మొదటి స్థానం, షాట్‌పుట్ అండర్-14, 17విభాగంలో మొదటి స్థానం సాధించారని పిడి నారాయణస్వామి తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, షటిల్, బ్యాడ్మింటన్‌లో మొదటి స్థానంలో గెలుపొందారని తెలిపారు. గెలుపొందిన వారిని ప్రిన్సిపాల్ విజయ్‌కుమారి, పిడి నారాయణస్వామి అభినందించారు. లాంగ్ జంప్ అండర్-14, 17 విభాగంలో ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. పోటీల్లో విజయం సాధించిన వారిని ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు.

## నూతన గృహాల కోసం దరఖాస్తులు చేసుకోండి -హౌసింగ్ ఏఈ త్రిశూల్

గుడిబండ అక్టోబర్ 23 ప్రభాతవార్త



మండలంలో ప్రభుత్వం మంజూరు చేసే నూతన గృహాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని హౌసింగ్ ఏఈ త్రిశూల్ మండల ప్రజలకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఇల్లు లేని వారు జాబ్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంకు అకౌంట్ బుక్ జెరాక్స్ లను హౌసింగ్ అధికారులకు అందజేయాలని తెలిపారు. అలాగే ఇప్పటికే దరఖాస్తులు చేసుకొన్న వారి దరఖాస్తులను ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పరిశీలిస్తారని వారికి సహకరించాలని కోరారు.

## పేదవాడి అనారోగ్యానికి కూటమి ప్రభుత్వ భరోసా

### - 22 మందికి రూ.10.32 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చిక్కుల పంపిణీ -ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, అక్టోబర్ 23 ప్రభాతవార్త :



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

అనారోగ్యంతో బాధపడుతూ స్వంత ఖర్చులతో అప్పులు చేసి కార్పొరేట్ ఆసుపత్రులలో చికిత్సలు చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేద మధ్యతరగతి ప్రజలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు పేర్కొన్నారు. గురువారం ప్రజా వేదికలో 22 మందికి రూ. 10.32 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదవారి ఆరోగ్యం పట్ల తెలుగుదేశం ప్రభుత్వం ఎంతో శ్రద్ధ వహిస్తోందని అన్నారు. దాదాపు ప్రతినెల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పేదలకు అందిస్తున్న వైనమే ఇందుకు నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మోరేపల్లి మల్లికార్జున మార్కెట్ కమిటీ చైర్మన్ భోయ లక్ష్మీదేవి రమేష్ మండల పార్టీ అధ్యక్షులు గోళ్ళ వెంకటేశులు, టి ఆర్ తిప్పేస్వామి, శివన్న, ధనుంజయ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

09ATP27_09ATP27.qxd 24-10-2025 AM 12:05 Page 1





కుస్తీ పోటీల్లో ప్రతిభ చాటిన పీసీఎంఆర్ విద్యార్థి

## రాష్ట్రస్థాయి కుస్తీపోటీల్లో కాంస్యపతకం సాధించిన పీసీఎంఆర్ విద్యార్థి

ధర్మవరంటౌన్, అక్టోబరు 23 ప్రభాతవార్త

మండల పరిధిలోని నాగలూరు వద్దగల రూపారాజ పీసీఎంఆర్ పాఠశాల విద్యార్థి అరుణ్ కుమార్ రెడ్డి రాష్ట్రస్థాయి కుస్తీపోటీల్లో ప్రతిభ కనబరచి కాంస్యపతకం సాధించినట్టు పాఠశాల చైర్మన్ హర్షవర్ధన్ తెలిపారు. విజయవాడలో బుధవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జరిగిన అండర్19 రాష్ట్రస్థాయి కుస్తీ (రెజ్లింగ్)పోటీల్లో సత్తాచాటినట్టు ఆయన తెలిపారు. ఈ విద్యార్థిని పాఠశాలచైర్మన్ తో పాటు డైరెక్టర్ రూపారాజా కృష్ణ, జగదీశ్, కరస్పాండెంట్ నాగమోహన్ రెడ్డి, ప్రిన్సిపల్ నరేశ్ కుమార్ రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

## మరూరు వీర నాగేంద్ర స్వామి నూతన అన్నదాన ట్రస్ట్ ఏర్పాటు

అమరాపురం అక్టోబర్ 23 ప్రభాతవార్త



సన్మానం చేస్తున్న దృశ్యం

మండల సమీపంలో ఉన్న పురాతన చరిత్ర కలిగిన మరూరు శ్రీ వీర నాగేంద్ర స్వామి దేవాలయ నూతన అన్నదాన ట్రస్టును దేవాలయ కమిటీ మరియు; భక్తులు గురువారం ఎంపిక చేశారు. అన్నదాన కమిటీ ట్రస్ట్ అధ్యక్షుడిగా రాగలహళ్లి కరేగౌడ్, ఉపాధ్యక్షుడిగా మండల టిడిపి క్లస్టర్ కో కన్వీనర్ టిడిపి యువ నాయకుడు కనకనపల్లి మంజు తారక్, గౌరవ అధ్యక్షుడిగా జీర్గేపల్లి నాగభూషణ్ లను మరియు 27 మంది ట్రస్ట్ కమిటీ సభ్యులుగా ఎంపిక చేసి పావగడ లో రిజిస్టర్ చేయించడం జరిగిందని మంజు తారక్ తెలిపారు. అనంతరం వీర నాగేంద్ర స్వామి దేవాలయ కమిటీ వారిచే అన్నదాసోహ నూతన ట్రస్ట్ అధ్యక్షుడికి, ఉపాధ్యక్షుడికి , గౌరవ అధ్యక్షుడికి,కమిటీ సభ్యులకు శాలువా పూలమాలవులతో ఘనంగా సన్మానం చేశారు. విచ్చేసే భక్తులకు అన్న దాసోహ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్న దాన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించడానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా అధ్యక్షుడు కరేగౌడ్, ఉపాధ్యక్షుడు యువ నాయకుడు మంజు తారక్ తెలిపారు.

## టిడిపి మండల కన్వీనర్ ఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్సీల చొరవతో 3కోట్లు మంజూరు

అమరాపురం అక్టోబర్ 23 ప్రభాతవార్త

మండలమునకు మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు,మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిల చొరవతో మండలంలోని 3 గ్రామ పంచాయతీల కు జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ద్వారా బిటి రోడ్లు నిర్మాణమునకు గాను 3కోట్లు నిధులు మంజూరైనట్లు అమరాపురం మండల టిడిపి కన్వీనర్ కృష్ణమూర్తి తెలిపారు. హేమావతి అమరాపురం మెయిన్ రోడ్డు నుంచి చిత్రాలింగేశ్వర దేవాలయం వరకు( మద్దనకుంట సమీపం ), హేమావతి హోసహట్టి మెయిన్ రోడ్డు నుంచి కోర్రేవు కర్ణాటక బార్డర్ వరకు వయా (రంగనాథ స్వామి దేవాలయం) రోడ్లు, కెంకెర గ్రామం నుండి నిద్రగట్ట గ్రామమునకు బీటీ రోడ్లు మంజూరైనట్లు ఈ సందర్భంగా ఆయా గ్రామ ప్రజలు టిడిపి ముఖ్య నాయకులు కార్యకర్తలు రోడ్లు మంజూరైనందుకు మడకశిర శాసనసభ్యులు ఎమ్మెస్ రాజుకి మరియు మాజీ శాసనమండలి సభ్యులు గుండుమల తిప్పేస్వామికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు

## అయ్యప్పభక్తుల మండల అధ్యక్షుడిగా బైసానిహరికుమార్ ఎంపిక

ధర్మవరంటౌన్, అక్టోబరు 23 ప్రభాతవార్త



బైసాని హరికుమార్

పట్టణంలోని బ్రాహ్మణవీధికి చెందిన బైసాని హరికుమార్ అఖిల భారత అయ్యప్ప భక్తుల సంఘం మండల అధ్యక్షుడిగా ఎంపికచేసినట్టు ఆ సంఘం జాతీయ అధ్యక్షులు న్యాయవాది వాండ్రాసి పెంచలయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నూతనంగా ఎంపికైన హరికుమార్ మాట్లాడుతూ.. నిత్యం అయ్యప్ప భక్తుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. అదేవిధంగా అఖిలభారత అయ్యప్ప భక్తుల సంఘం బలోపేతానికి కృషిచేస్తానన్నారు. తన ఎంపికకు సహకరించిన ఆసంఘం జాతీయ అధ్యక్షుడు పెంచలయ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## అప్పులబాదతో ఉరివేసుకుని చేనేత కార్మికుడి ఆత్మహత్య

ధర్మవరంటౌన్, అక్టోబరు 23 ప్రభాతవార్త



నీలూరి రాజేశ్ (ఫైల్‌ఫోటో)

అప్పుల బాదతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలోని చంద్రబాబు నగర్ లో గురువారం సాయంత్రం జరిగింది. టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన వివరాల మేరకు.. చంద్రబాబునగర్ కు చెందిన నీలూరి రాజేశ్(30) అనే చేనేత, కార్మికుడు కూలిమగ్గం నేస్తు కుటుంబాన్ని పోషించుకునేవాడు. అయితే నేసిన చీరలకు గిట్టుబాటు రాక కుటుంబ అవసరాలకు అప్పులు చేశాడు. దీంతో అప్పులుతీర్చే మార్గం కనిపించక తరచూ తీవ్ర మనోవేదనకు గురయ్యేవాడు. దీంతో చివరికి ఇంటిలో ఎవరు లేనిసమయంలో మగ్గానికే చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు ఒడిగట్టాడు. బయటకు వెళ్లిన బార్య గంగరత్నమ్మ ఇంటికి వచ్చి తలుపులు తీయడానికి ప్రయత్నించిన రాకపోవడంతో అనుమానం వచ్చి స్థానికుల సహాయంతో తలుపులు పగలకొట్టి లోపలికి వెళ్లి చూడగా అప్పటికే రాజేశ్ ఉరికి వేలాడుతూ కనిపించాడు. ఆమె వికతజీవిగా ఉన్నభర్తను చూసి బోరున విలపించింది. విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు సంఘటనాస్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి ఆత్మహత్యకు గల కారణాలనుతెలుసుకుని బార్యపిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. మృతునికి భార్యతోపాటు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. చేనేత కార్మికుడి కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని, పిల్లలను చదివించాలని స్థానికులు కోరుతున్నారు.

## ద్విచక్రవాహనం దొంగతనం

ధర్మవరంటౌన్ అక్టోబర్ 23 ప్రభాతవార్త



తన ద్విచక్రవాహనం దొంగతనం చేశారని చెబుతున్న బాధితుడు రామంజినేయులు

ధర్మవరం పట్టణంలోని కోట కురుబవీధికి చెందిన రామంజినేయులు తన ద్విచక్రవాహనాన్ని ఇంటి వద్ద బుధవారం రాత్రి పార్కింగ్ చేసి ఇంట్లో నిద్రించాడు. గురువారం ఉదయం లేచి చూడగా ఇంటి ముందున్న డియో స్కూటీ వాహనం కనిపించలేదు. ఏపీ39ఈ 8335 నెంబర్ గల ద్విచక్రవాహనం కనిపించకపోవడంతో బాధితుడు రామంజినేయులు వెంటనే వన్ టౌన్ పోలీస్స్టేషన్కు వచ్చి ఫిర్యాదు చేశాడు. ద్విచక్రవాహనాన్ని దొంగలు ఎత్తుకెళ్లారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని ద్విచక్రవాహన దొంగల కోసం గాలిస్తున్నారు.

## ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం విడనాడాలి

-మాజీ ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు బి.విజయ్‌కుమార్

ఉరవకొండ, అక్టోబర్ 23 ప్రభాతవార్త



మాజీ ఎంపీటీసీ బి.విజయ్‌కుమార్

నియోజకవర్గ కేంద్రమైన ఉరవకొండ పట్టణంలోని 50 పడకల ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రికి వచ్చే రోగులు, క్షతగాత్రులకు సరైన వైద్యం అందించకుండా కొందరు వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యహరిస్తున్నారని ఉరవకొండ మాజీ ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు బి.విజయ్‌కుమార్ వాపోయారు. పట్టణంలో ద్విచక్రవాహంలో వెళుతూ సుధాకర్ అనే వ్యక్తి గురువారం రోడ్డు ప్రమాదంలో గాయపడగా అతన్ని స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లగా అతనికి పరీక్షించి తగిన వైద్యం అందించడంలో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా బాధితుడు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చిందన్నారు. గాయానికి మందులుపూసి కట్లు కట్టాలని అక్కడి సిబ్బందిని కోరగా నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. జిల్లా అధికారులు వైద్యులు, సిబ్బంది అంకిత భావంతో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## మాదక ద్రవ్యాలకు బానిసై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు

-మానసిక వైద్య నిపుణులు డాక్టర్ గరుగు బాలాజీ

-నిగమా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన

ఉరవకొండ, అక్టోబర్ 23 ప్రభాతవార్త




విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మానసిక వైద్య నిపుణులు డాక్టర్ గరుగు బాలాజీ

మాదక ద్రవ్యాలు, మొబైల్ ఫోన్లను బానిసై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని మానసిక వైద్య నిపుణులు డాక్టర్ గరుగు బాలాజీ సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిగమా ఫౌండేషన్, ప్రగతి పథం యూత్ అసోసియేషన్, కేహెచ్ మైండ్ కేర్ హాస్పిటల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ సంయుక్తంగా విద్యార్థులకు మాదక ద్రవ్యాల నివారణ, మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్ వ్యసనాలపై అవగాహన సదస్సు నిర్వహించగా ప్రిన్సిపాల్ డా॥డి.ఆదినారాయణ అధ్యక్షత వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ గరుగు బాలాజీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, మొబైల్ ఫోన్లు మానవ శరీరంపై తీవ్ర ప్రభావం చూపి అనేక అనర్థాలకు కారణమవుతాయన్నారు. ఈ సందర్భంగా నిగమా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ పరివర్తన్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.ఎన్.మస్తానప్ప, రాష్ట్రపతి అవార్డు గ్రహిత కె.జయమారుతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా॥బి.వెంకటరాముడు, ఎం.పరమేష్, అధ్యాపకులు డా॥అయ్యన్న, డా॥కృష్ణవేణి, నారాయణస్వామి, డా॥రమేష్‌బాబు, నీలి వెంకటేశులు, ప్రభాకర్, రామాంజినేయులు, రమేష్, నాగేంద్ర, ప్రగతి పథం యూత్ అసోసియేషన్ సభ్యులు పి.గోపి తదితరులు పాల్గొన్నారు.

## హిందూ స్మశాన వాటికలో చేతి పంపుకు మరమ్మతులు

-పయ్యావుల శ్రీనివాసులు చొరవతో సమస్యకు పరిష్కారం

ఉరవకొండ, అక్టోబర్ 23 ప్రభాతవార్త



చేతి పంపుకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

పట్టణంలోని వెలిగొండ రోడ్డులోగల హిందూ స్మశాన వాటికలో చెడిపోయిన చేతి పంపుకు గురువారం మరమ్మతులు చేశారు. చేతి పంపు దాదాపు నెలరోజులుగా చెడిపోవడంతో చనిపోయిన వారికి అంత్యక్రియలు చేసే సమయంలో నీటి కోసం ఇబ్బందులు పడే పరిస్థితులు కొనసాగగా విషయాన్ని టీడీపీ నాయకులు టీడీపీ సీనియర్ నేత పయ్యావుల శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి మండల పరిషత్ అధికారులకు తగిన సూచనలు చేయడంతో బోరుకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తెచ్చారు. ఈ కార్యక్రమంలో మేజర్ గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు ఎం.రామాంజినేయులు, ఎస్.కె.ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ చైర్మెన్ బి.గోపాల్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## పెద్ద కొట్టాలపల్లిలో ఆసక్తికరంగా మండలస్థాయి కబడ్డీ పోటీలు

-మండలంలోని వివిధ పాఠశాలల నుండి తరలివచ్చిన క్రీడాకారులు

ఉరవకొండ, అక్టోబర్ 23 ప్రభాతవార్త



క్రీడాకారులను పరిచయం చేస్తున్న దృశ్యం

నియోజకవర్గంలోని విడపనకల్లు మండలం పెద్ద కొట్టాలపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో గురువారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి కబడ్డీ పోటీలు ఆసక్తికరంగా కొనసాగాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.శేషగిరి ఆధ్వర్యంలో జరిగిన పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ మోదుపల్లి రామాంజినేయులు, వైస్ ఎంపీపీ సునీత, ఎస్ఎంసీ చైర్మెన్ హెచ్.రాయుడు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పోటీలకు మండలంలోని వివిధ గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు తరలివచ్చారు. పోటీల్లో అండర్-14 బాలికల విభాగంలో చీకలగుర్కి జెడ్పీహెచ్ఎస్ జట్టు విన్నర్స్‌గా నిలవగా విడపనకల్లు జెడ్పీహెచ్ఎస్ జట్టు రన్నర్స్‌గా నిలిచింది. బాలుర విభాగంలో పాల్తూరు జెడ్పీహెచ్ఎస్ జట్టు విన్నర్స్‌గా నిలువగా, హావళిగి జెడ్పీహెచ్ఎస్ జట్టు రన్నర్స్‌గా నిలిచింది. అండర్-17 బాలుర, బాలికల విభాగంలో జెడ్పీహెచ్ఎస్ పాల్తూరు జట్లు విన్నర్స్‌గా నిలిచాయి. బాలుర, బాలికల విభాగాల్లో జెడ్పీహెచ్ఎస్ విడపనకల్లు జట్టు రన్నర్స్‌గా నిలిచాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మృత్యుంజయ, వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



కబడ్డీ పోటీలు జరుగుతున్న దృశ్యం

## పీజీఆర్ఎస్ అర్జీలకు సంతృప్తికరమైన పరిష్కారం చూపాలి

-సమీక్షా సమావేశంలో కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.తిప్పేనాయక్

ఉరవకొండ, అక్టోబర్ 23 ప్రభాతవార్త



సమావేశానికి హాజరైన వీఆర్‌వోలు సిబ్బంది

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) అర్జీలకు సంతృప్తికరమైన పరిష్కారం చూపాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.తిప్పేనాయక్ అన్నారు. పట్టణంలోని మండల తహశీల్దార్ కార్యాలయంలో గురువారం ఆయన పీజీఆర్ఎస్ అర్జీలపై తహశీల్దార్ ఎన్.మహబూబ్‌బాషా, వీఆర్‌వోలు, కార్యాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ప్రతి సోమవారం జరిగే పీజీఆర్ఎస్‌లో ప్రజలు ఇచ్చే ప్రతి అర్జీను ప్రత్యేకంగా నమోదు చేసుకొని ఆయా శాఖలతో సమన్వయం చేసుకొని తగిన పరిష్కారం చూపాలన్నారు. మండలస్థాయిలో అర్జీల పరిష్కారం నెమ్మదిగా కొనసాగుతున్నందునే ప్రజలకు జిల్లా కేంద్రంలో జరిగే పీజీఆర్ఎస్‌లో అర్జీలను ఇస్తున్నారన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా ప్రతి అర్జీకు తగిన పరిష్కారం లేదా వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వోలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సూచనలు ఇస్తున్న కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.తిప్పేనాయక్

## వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న వర్షాలు..!

-పగటి ఉష్ణోగ్రతలు తగ్గి పెరుగుతున్న చలి తీవ్రత




ఉరవకొండలో గురువారం వర్షం కురుస్తున్నప్పటి దృశ్యం

ఉరవకొండ, అక్టోబర్ 23 ప్రభాతవార్త

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో ఉరవకొండ ప్రాంతంలో ఒక మోస్తారు వర్షాలు కురుస్తున్నాయి. గురువారం ఉదయం, మధ్యాన్నం కొద్దిసేపు వర్షం పడగా ఆ వెంటనే ఎండ కూడా పడింది. రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో పగటి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టగా చలి తీవ్రత పెరుగుతోంది. వర్షాల కారణంగా మట్టిరోడ్లు బురద మయంగా మారి అడుగుతీసి అడుగు వేయడానికి వీలు లేకుండా పోవడంతో శివారు కాలనీల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాల కారణంగా చెట్లు కూలిపోయి విద్యుత్ తీగలు తెగిపడి విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా విద్యుత్‌శాఖ అధికారులు తగిన ముందస్తు చర్యలు తీసుకొని ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాల్సి ఉంది.

## స్టేట్ కమిటీలో దేవా నరసింహులు యాదవ్‌కు చాన్స్

జిల్లా అధ్యక్షులు లక్ష్మినరసప్ప యాదవ్ చేతుల మీదుగా నియామక పత్రం అందజేత.



జిల్లా అధ్యక్షులు నుంచి నియామక పత్రాన్ని అందుకుంటున్న నరసింహప్ప.

గోరంట్ల అక్టోబర్ 23 ప్రభాతవార్త

గోరంట్ల మండలం మల్లాపల్లి పంచాయతీ పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన టిడిపి జిల్లా కార్యదర్శి నరసింహులు యాదవును అఖిలభారత యాదవ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు లాకా వెంగల్ రావు యాదవ్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గురువారం అఖిలభారత యాదవ సంఘం ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షులు లక్ష్మీనరసప్ప యాదవ్ చేతుల మీదుగా కొత్తపల్లి నరసింహులు యాదవ్ నూతన నియామక పత్రాన్ని అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా దేవా నరసింహప్ప యాదవ్ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి రాష్ట్రస్థాయి కమిటీలో క్రియాశీలక బాధ్యత అప్పగించినందుకు రాష్ట్ర అధ్యక్షునికి, జిల్లా అధ్యక్షునికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామని, భవిష్యత్తులో క్షేత్రస్థాయి నుంచి సంఘం అభివృద్ధి కోసం కృషి చేస్తానని దేవా నరసింహప్ప యాదవ్ పేర్కొన్నారు.

## పాఠశాలలో ప్రత్యేక ఆధార్ శిబిరమును సద్వినియోగం చేసుకోండి..

ఎంపీడీవో సాయి మనోహర్.

ధర్మవరం రూరల్ అక్టోబర్ 23 ప్రభాతవార్త

మండల పరిధిలోని మూడు గ్రామ పంచాయతీలలో పాఠశాల యందు ప్రత్యేక ఆధార్ శిబిరమును నిర్వహించడం జరుగుతోందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సాయి మనోహర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఈనెల 23వ, 24వ తేదీలలో గొట్లూరు 1 జడ్పీహెచ్ఎస్ పాఠశాల యందు, గొట్లూరు 2 లో ఎంపీ యూపీ పాఠశాల యందు 25వ 27వ తేదీలలో, చిగిచెర్ల జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ నందు ఈనెల 28వ 29వ 30వ తేదీలలో ప్రత్యేక ఆధార్ ఉంటుందని తెలిపారు. ఏఎన్ఎం మహిళా పోలీస్ స్కూల్ విద్యార్థులను గుర్తించి ప్రత్యేక ఆధార్ శిబిరమును విజయవంతం చేయాలని తెలిపారు. ఈ ఆధార్ శిబిరాలలో డిజిటల్ సహాయకులతో పాటు పంచాయతీ కార్యదర్శి మహిళా పోలీసులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్



వార్డ్ మెంబర్ లక్ష్మి రెడ్డి కూతురు వివాహ వేడుకల్లో మాజీ మంత్రి ఉషశ్రీ

సోమందేపల్లి అక్టోబర్ 23 ప్రభాతవార్త

మండలం కేంద్రంలోని గ్రామ మేజర్ పంచాయతీలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, వార్డు మెంబర్ లక్ష్మిరెడ్డి కుమార్తె వివాహ రిసెప్షన్ లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన అభినందనలు తెలియజేసిన మాజీ మంత్రి, జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ చరణ్ , ఈ సందర్భంగా ఎంపీపీ గంగమ్మ,ఉప సర్పంచ్ వేణుగోపాల్ ,లక్ష్మారెడ్డి ,వైసిపి నాయకులు తదితరులు ఉన్నారు.

## కళ్యాణదుర్గం నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

కలెక్టర్ ను కోరిన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు



కళ్యాణదుర్గం నియోజకవర్గ సమస్యలపై జిల్లా కలెక్టర్ తో చర్చిస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, అక్టోబర్ 23 ప్రభాతవార్త : అనంతపురం జిల్లాలోని వెనుకబడిన ప్రాంతమైన కళ్యాణదుర్గం నియోజకవర్గం అభివృద్ధికి ప్రత్యేక చొరవ తో కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు విజ్ఞప్తి చేశారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో ఎమ్మెల్యే సురేంద్రబాబు కలెక్టర్ ఆనంద్ కుమార్ ను కలిసి నియోజకవర్గ అభివృద్ధిపై సుదీర్ఘంగా చర్చించారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా కళ్యాణదుర్గం నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదని తెలిపారు.నియోజకవర్గంలో ఎక్కడా కూడా సరైన రహదారులు లేక గ్రామాల్లోని ప్రజలు మండల కేంద్రాలకు వెళ్లాలన్న ఇబ్బందులు పడుతున్నారని, బీటీపీ కాలువకు భూములు ఇచ్చిన రైతులకు వెంటనే పరిహారం అందించి కాలువ పనులు వేగంగా జరిగేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. గత ప్రభుత్వం నాడు నేడు పేరుతో పాఠశాలల్లో అసంపూర్తిగా పనులు చేసి వదిలేశారని, ఆగిన పనులను తిరిగి కొనసాగించి పాఠశాలల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నత చదువులు చదివి సరైన ఉపాధి ఉద్యోగ అవకాశాలు లేక కూలీ పనులు చేసుకుంటున్నారని అలాంటి వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశం కల్పించేందుకు తిమ్మసముద్రం ఏపీఐఐసీ భూములలో మౌలిక వసతులుకల్పించి తగిన పరిశ్రమలు ఏర్పాటు అయ్యేలా చూడాలని, రైతులకు రాయితీ ద్వారా ఆధునిక వ్యవసాయ పరికరాలు అందించాలని, ఉద్యాన పంటల పెంపకంపై మరింత దృష్టి సారించి రైతులకు మామిడి, చీని ఇతర పండ్ల తోటల సాగుకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో ఎక్కువగా టమోటా పండిస్తారని గిట్టుబాటు ధర లేక రోడ్ల మీద పారబోస్తున్నారని వారికోసం టమోట ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ కు విన్నవించారు. అలాగే నియోజకవర్గ సమస్యలపై వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్కు అందజేశారు. ఈ సందర్భంగా స్పందించిన జిల్లా కలెక్టర్ తప్పకుండా నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు..

## సిఎం, డిప్యూటి సిఎం చిత్రపటాలకు పాలాభిషేకం

గుత్తి, అక్టోబర్ 23 ప్రభాతవార్త



పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

గుత్తి పట్టణంలో గురువారం శ్రీసూర్యవంశ వడి యరాజుల సంఘం ఆధ్వర్యంలో ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రప టాలకు పాలాభిషే కం చేశారు. వడ్డెర్లకు, వడ్డెర్ల సొసైటీలకు మైనింగ్ లీజ్‌లో 15 శాతం రిజర్వేషన్ కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు విధి విధానాల రూపకల్పన చేయాలని అధికారులకు ప్రభుత్వం ఆదేశించింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కిందని వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు చిరంజీవి, స్టేట్ ప్రెసిడెంట్ దేరంగుల లక్ష్మీదేవి, రాష్ట్ర కార్యదర్శి బత్తుల మారుతిప్రసాద్, తిరుపతయ్య, వరదరాజులు, వడ్డే వీరాంజి, మునేష్, రంగస్వామి, నాగరాజు, వెంకటేశు, సాయి, అంకన్న, తదితరులు పాల్గొన్నారు.

## నీట మునిగిన ప్రాంతాల్లో పర్యటించిన అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్





సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్

అనంతపురం, అక్టోబర్ 23 ప్రభాతవార్త:

వర్షాల నేపథ్యంలో గురువారం రాత్రి అనంతపురం నగరంలోని రజక్ నగర్ మరియు గౌరవ గార్డెన్స్ ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్ పర్యటించారు. ఈ సందర్భంగా వర్షాల వేళ నగరంలోని నడిమివంక నుంచి ప్రవహించే నీటికి అడ్డంకులు తొలగించేందుకు చేపడుతున్న చర్యలను అసిస్టెంట్ కలెక్టర్ పరిశీలించారు. స్థానిక ప్రజలతో మాట్లాడుతూ ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆయన అడిగి తెలుసుకున్నారు. వర్షాల వేళ ప్రజలంతా అత్యంత అప్రమత్తంగా ఉండాలని, అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇందులో భాగంగా నగర పాలక సంస్థ అవసరమైన చోట జేసిబిలను ఏర్పాటు చేస్తూ ఒక్కో పాయింట్ వద్ద ఒక్కో ఇంజనీర్ మరియు సిబ్బందిని నియమించి జేసిబిల ద్వారా నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న చెత్తాచెదరాన్ని తొలగింపు పనులను అసిస్టెంట్ కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

